
ప్రజాశక్తి
ఆదివారం 23 జూన్ 2024



ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కమిషనర్ ఎం.ఎం.నాయుడు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 24 నుంచి ప్రతి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయం మొదటి అంతస్తులో ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించనున్నట్లు తెలిపారు. ప్రతి సోమవారం ఉదయం 10:30 గంటల నుండి ఈ కార్యక్రమం మొదలవుతుందన్నారు. నగర పరిధిలో ఉన్న ప్రజా సమస్యలను, స్థానిక సమస్యలను ఈ వేదిక ద్వారా ప్రజలు తెలియ పరచవచ్చని చెప్పారు. ప్రజలు ఈ సదవకాశాన్ని వినియోగించుకొని తమ సమస్యలను వినతి రూపంలో అధికారులకు అందించవచ్చని తెలిపారు.

కౌన్సిల్ సమావేశంలో

అధికారులే లక్ష్యం



సమావేశం నిర్వహిస్తున్న మేయర్ విజయలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి కార్పొరేటర్

- రెవెన్యూ శాఖ పనితీరే మా ఓటమికి కారణం
- పన్నుల విధింపులో ఆర్ఐల తీరుపై కార్పొరేటర్ల ఆగ్రహం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం నగర పాలక సంస్థ పాలకవర్గం సమావేశం అధికారులే లక్ష్యంగా జరిగింది. మేయర్ విజయలక్ష్మి అధ్యక్షతన శనివారం జరిగిన కౌన్సిల్ సాధారణ సమావేశంలో 14 ఎజెండాలపై చర్చించారు. ఎజెండాలోని 14 అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఎజెండాలోని నాల్గవ అంశంపై చర్చ జరుగుతున్న సమయంలో 50వ డివిజన్ తెలుగుదేశం పార్టీ కార్పొరేటర్ కర్రోతు రాధామణి మాట్లాడుతూ నగరపాలక సంస్థలో కార్పొరేటర్లకు విలువలేకుండా పోయిందన్నారు. ఎవరిని అడిగి ఇటీవల నగర పాలక సంస్థ లో సిబ్బంది బదిలీలు చేపట్టారని ప్రశ్నించారు. వార్డుల్లో తాగునీటి సమస్య, వీధి లైట్లు సమస్యలు, కాలువల్లో చెత్తలు, పూడికలు తీకయడం లేదని, ఎజెండా ఎవరు తయారు చేస్తారో తెలియదని, ఇంకా అధికారులు వైసిపి ముసుగులో అన్నారు వైసిపి ముసుగు నుంచి బయటకు రావాలని, ఏ నిర్ణయాలు చేసినా ఎమ్మెల్యేకు చెప్పాలని, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్పొరేటర్లు స్వేచ్ఛగా మాట్లాడే అవకాశం వచ్చిందని, ఎమ్మెల్యే నగరాభివృద్ధికి చిత్తశుద్ధితో ఉన్నారని అన్నారు. అనంతరం కార్పొరేటర్ రంగారావు మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో ఉన్న ఆర్ ఐలు ఇష్టారాజ్యంగా పన్నులు విధించడం వల్ల ప్రజల్లో తమపై వ్యతిరేకతకు కారణమని అన్నారు. బాబామెట్టకు చెందిన కార్పొరేటర్ గాదం మురళి మాట్లాడుతూ నగరంలో 50 డివిజన్లలో ఇష్టారాజ్యంగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులు ఏమి చేస్తున్నారని మండిపడ్డారు. కంటోన్మెంట్ ఏరియాకు చెందిన కార్పొరేటర్ బి.ధనలక్ష్మి మాట్లాడుతూ పన్నులు వేసే విధానం బాగో లేదన్నారు. దీని వల్లే తాము ఇటీవల ఎన్నికల్లో ఓడిపోయామని అన్నారు. 44వ డివిజన్ కార్పొరేటర్ తాళ్లపూడి సంతోషి మాట్లాడుతూ కెఎల్ పురం ప్రాంతంలో వాటర్ ట్యాంక్ నిర్మాణం జరిగి ఆరు నెలలు అవుతున్నా నేటికీ కుళాయిలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. 200కు పైగా దరఖాస్తులు కుళాయిలు కోసం పెట్టుకుంటే కేవలం రెండు కుళాయిలు ఆరు నెలల్లో వ్యవధిలో వేశారని, మిగిలినవి ఎందుకు వెయ్యలేదో అధికారులు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ఫ్లోర్ లీడర్ రాజేష్ మాట్లాడుతూ అక్రమ మోటార్లపై చర్యలు తీసుకొని, సీజ్ చేసి అపరాధ రుసుము విధించాలని కోరారు. కార్పొరేటర్ల అనుమతి లేకుండా వార్డుల్లో ఏ పనులూ చేసేందుకు వీలు లేదని హెచ్చరించారు. పార్టీల పేరుతో విమర్శలు చేస్తే సహించేది లేదన్నారు. అనంతరం కో ఆప్షన్ సభ్యులు ముద్దాడ రమణి సమావేశంలో బదిలీలు, కుక్కలు, తాగునీటి సమస్యపై లేవనెత్తారు. ఫ్లోర్ లీడర్ రాజేష్ మాట్లాడుతూ కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు చెప్పిన సమస్యలను పరిశీలించి వాటిని సరిచేయాలని కోరడంతో కమిషనర్ స్పందించి పరిష్కరిస్తామని చెప్పారు. అనంతరం 14 అంశాలతో ఎజెండాను, అనంతరం ప్రత్యేక సమావేశం ద్వారా జరిగిన మరో నాలుగు అంశాలు ఎజెండాను ఆమోదించారు. ప్రజారోగ్య శాఖలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, డ్రైవర్లకు వేతనాలు రూ.24,500, రూ.21వేలకు పెంచుతూ ప్రభుత్వ ఆదేశాలను కౌన్సిల్ ఆమోదించింది. విజయనగరం పాలకొండ రోడ్డు మరమ్మత్తు పనులు రూ.93.50 లక్షలతో చేపట్టేందుకు ఆమోదం తెలిపింది. హనుమాన్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వహించే గో సంరక్షణ శాల నిర్మాణానికి జనతా బజార్ సిటీ బస్టాండ్ దగ్గర 250 చదరపు గజాల స్థలం కేటాయించారు. మాజీ సైనికులకు ఆస్తి పన్ను మినహాయింపు, మంది పంప్ హౌస్‌లో పని చేస్తున్న 49మంది కార్మికులను ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో తీసుకునేందుకు ఆమోదం తెలిపారు. సమావేశంలో కమిషనర్ ఎంఎం నాయుడు, అన్ని శాఖలు అధికారులు, ఫ్లోర్ లీడర్ రాజేష్, కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

హమ్మయ్యా..! నోరు విప్పారు

- మూడేళ్ల తర్వాత కౌన్సిల్ సమావేశంలో సమస్యలపై చర్చ పెట్టిన వైసిపి కార్పొరేటర్లు
- స్వేచ్ఛగా ఉండండి.. అంటూ టిడిపి కార్పొరేటర్ చురక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కూర్చున్నాం సంతకం పెట్టేసాం.. మీటింగ్ అయిపోయింది.. వెళ్లిపోయామా.. అన్నట్లుగా గత మూడేళ్లగా నగరపాలక సంస్థ పాలక సభ్యులు వ్యవహరించారు. మూడేళ్లలో ఒక్క సమావేశంలో కూడా ఆయా ప్రాంతాల సమస్యలపై చర్చించిన దాఖలాలు లేవు. ఒక్క సారిగా అందుకు భిన్నంగా కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ప్రతిపక్ష సభ్యులు మాదిరిగా అధికార పాలకపక్షం వైసిపి కార్పొరేటర్లు సమస్యలపై సమావేశంలో ఏ కరువు పెట్టారు. అధికారులు పని చేయడంలేదని, వీధి లైట్లు వెలగడం లేదని, నగరాభివృద్ధికి వేసిన పార్కుకు, జంక్షన్ లో వేసిన లైట్లు వెలగడం లేదని, నాసిరకం లైట్లు వేశారని, బురద నీరు వస్తుందని,కాలువల్లో పూడికలు తియ్యడం లేదని, అధికారులు కార్పొరేటర్లకు గౌరవం ఇవ్వడంలేదని ఆవేదన చెందారు. నగరంలో సుందరీకరణ, అభివృద్ధి జరిగిందంటే మా వలనే అని చెప్పే వైసిపి నాయకులు ఒక్కసారిగా ప్లేట్ మార్చినట్లు సమస్యలపై ఏ కరువు పెట్టడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. గతంలో అప్పటి ఎమ్మెల్యే కనుసన్నల్లోనే సమావేశాలు జరగడం, నిర్ణయాలు చేయడం ఉండేది. కోలగట్ల ఎమ్మెల్యేగా ఓడిపోయిన తర్వాత జరిగే మొదటి కౌన్సిల్ సమావేశం కావడంతో ఒక్క సారిగా చర్చోపా చర్చలు సాగించారు. అయితే అధికారులు వైఫల్యం వలనే నగరంలో సమస్యలకు కారణమని ప్రతిపక్ష పాత్ర పోషించారు. మరో రెండేళ్ల పదవి కాలం ఉండటంతో నగరపాలక సంస్థ పాలకవర్గం వైసిపి చేతిలో, ఎమ్మెల్యే టిడిపి కావడంతో రానున్న సమావేశాలు వాడివేడిగా జరిగే అవకాశాలు ఉన్నాయి.

తీగ లాగుతున్నారు..

డొంక కదిలేనా?

- పరిహారం పంపిణీలో అవకతవకలపై ఫిర్యాదుకు సిద్ధమవుతున్న జనసేన
- ముఖ్యమంత్రి, డిప్యూటీ సిఎం, కేంద్రమంత్రిని కలవాలని నిర్ణయం
- ఇప్పటికే సమావేశమైన జనసేన నాయకులు

ప్రజాశక్తి - భోగాపురం

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణానికి సేకరించిన 2700 ఎకరాల్లో రైతులకు పూర్తి స్థాయిలో నష్ట పరిహారం అందకపోవడంపై జనసేన నాయకులు దృష్టి పెట్టారు. పరిహారం అందక ఇప్పటికీ కొంతమంది రైతులు న్యాయస్థానం చుట్టూ తిరుగుతున్నారని ఈ నేపథ్యంలో జనసేన నాయకులు దీనిపై విచారణ చేయించేందుకు సిద్ధమవుతున్నారు. ఒక సీనియర్ ఐఎఎస్ అధికారితో విచారణ జరిపించాలని వీరంతా కోరుతున్నారు. ఇందుకు సంబంధించి ఆ పార్టీ నాయకులు కాకర్లపూడి శ్రీనివాసరాజు, మట్టా అయ్యప్పరెడ్డితో పాటు కొంత మంది రైతులు సమావేశమయ్యారు. విమానాశ్రయ భూముల నష్ట పరిహారం విషయంలో రైతులకు జరిగిన అన్యాయం గురించి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కేంద్ర పౌరవిమానాయ శాఖ మంత్రి కింజరాపు రామ్మోహననాయుడుకు, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే మాధవితో కలిసి వెళ్ళి వినతి పత్రం అందజేసేందుకు సిద్ధమవుతున్నారు. ఎమ్మెల్యే లోకం మాధవి ప్రమాణ స్వీకారం పూర్తి చేసి ఇక్కడకు వచ్చిన వెంటనే ఆమెను కలిసి దీనిపై చర్చించనున్నారు. అనంతరం శ్రీకాకుళం పార్టీ కార్యాలయంలో ఎమ్‌పి రామ్మోహననాయుడును కలిసి పరిహారం విషయంలో జరిగిన అన్యాయం గురించి ముందుగా వివరించనున్నామని ఆ పార్టీ నాయకులు కాకర్లపూడి శ్రీనివాసరాజు తెలిపారు.



ఎయిర్‌పోర్టు పనులు చేపడుతున్న యంత్రాలు

గత ప్రభుత్వం హయాంలో రైతుల పరిహారానికి సంబంధించి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ప్రధానంగా జిల్లా స్థాయి నుంచి మండల స్థాయి వరకు అధికారులు, నాయకులు పరిహారం విషయంలో అన్యాయం చేశారని ఆరోపించారు. పరిహారం ఇవ్వకుండా బలవంతంగా భూములను తీసుకున్నారని అన్నారు. దీంతో చాలామంది రైతులు చివరకు న్యాయస్థానాన్ని ఆశ్రయించారని గుర్తు చేశారు. భూసేకరణ చట్టం ప్రకారం పట్టాలు లేకపోయినా సరే సంబంధిత రైతులకు ఖాళీ చేసేటప్పుడు ఖచ్చితంగా నష్టపరిహారం ఇవ్వాలి. కాని అలా ఇవ్వకుండా బలవంతంగా ఖాళీ చేయించారని అన్నారు. ఇప్పటికి వరకు సుమారు 80 మంది రైతులు కోర్టులో కేసులు వేసి ఉన్నారని అన్నారు. అందుకు ఉన్నత స్థాయికి చెందిన అధికారితో విచారణ చేయమని కోరుతామని ఆయన తెలిపారు. ఎమ్మెల్యే లోకం మాధవికి కూడా గతంలో రైతులు పడ్డ ఇబ్బందులు తెలుసునని అన్నారు. అమె కూడా రైతులతో కలిసి ప్రత్యక్షంగా పోరాడారని గుర్తు చేశారు.

29న లోక్ అదాలత్

విజయనగరం లీగల్ : ఈనెల 29న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షి దారులంతా వినియోగించు కోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ్ చక్రవర్తి తెలిపారు. ఈ అదాలత్ ఉమ్మడి జిల్లాలైన విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని అన్ని కోర్టులలోను నిర్వహిస్తామని తెలిపారు. పలు సివిల్, క్రిమినల్ కేసులు శాశ్వతంగా పరిష్కరిస్తారని తెలిపారు. రాజీ పడదగిన క్రిమినల్ కేసులను, మోటార్ ప్రమాద బీమా కేసులు, బ్యాంకు కేసులు, చెక్కు బౌన్స్ కేసులు, మనీ కేసులు, ప్రామిసరీ నోట్ కేసులు, ఎలక్ట్రిసిటీ కేసులు, ఎక్సైజ్ కేసులు, ల్యాండ్ కేసులు, కుటుంబ తగాదాలు వాటర్ కేసులు, మున్సిపాలిటీ కేసులు ప్రి లిటిగేషన్ కేసులు, ఇరు పార్టీల అనుమతితో రాజీ మార్గంలో శాశ్వత పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి విజయ కల్యాణి పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న సుంకరపేట గ్రామస్తులు

భూ కబ్జాపై చర్యలు తీసుకోవాలి

కలెక్టరేట్ వద్ద సుంకరపేట గ్రామస్తుల నిరసన

ప్రజాశక్తి-విజయనగరం కోట

ప్రభుత్వ పాఠశాల స్థలాన్ని ఆక్రమణదారులపై చర్యలు తీసుకొని, వన్‌బిని రద్దు చేయాలని కోరుతూ శనివారం మండలంలోని సుంకరిపేట గ్రామస్తులు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. తుమ్మగంటి సురేష్ పేరు మీద ఉన్న వన్‌బిని రద్దు చేయాలని కోరుతూ డిఆర్‌ఒ అనితకు వినతి పత్రం అందజేశారు. అనంతరం కలెక్టరేట్ గేటు వద్ద భవిష్యత్ తరాల కోసం భూమిని కాపాడాలి, వన్ బిన్ వెంటనే రద్దు చేయాలి, అక్రమ దారులపై చర్యలు తీసుకోవాలి అంటూ ఆ గ్రామస్తులు ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వేనెంబర్ 195 /5 ఖాతా నెంబర్ 300048లో ప్రభుత్వ పాఠశాలకు చెందిన మూడు ఎకరాల స్థలాన్ని తుమ్మగంటి సురేష్ పేరు అధికారులు వన్‌బి ఇచ్చేశారని తలెఇపారు. 5.54సెంట్లు భూమిని గతంలో హైస్కూల్‌కు కేటాయించగా అందులో సుమారు రెండు ఎకరాల స్థలంలో పాఠశాల నిర్మించారని తెలిపారు. మిగిలిన మూడు ఎకరాలు భూమిని స్కూల్ మైదానంగా కేటాయించారని తెలిపారు. ఆ భూమిని తుమ్మకంటి సురేష్ కబ్జా చేసి ఆన్‌లైన్‌లో తప్పుడు రికార్డులు నమోదు చేసుకున్నారని అన్నారు. వెంటనే అధికారులు ప్రభుత్వ భూమిని కబ్జా చేసి తప్పుడు పత్రాలు సష్టించిని వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సుంకర పేట మాజీ సర్పంచ్ సుంకరి రామనాయుడు, పైడిరాజు, శ్రీను, చక్రి, ప్రకాష్, భరత్ రామునాయుడు, మోహన్, మహేష్ , సత్యనారాయణ, దుర్గరాజు గ్రామ నాయకులు, యువత పాల్గొన్నారు.

ఆర్ఇసిఎస్‌ని పునరుద్ధరణకు కృషి

మాజీ ఎమ్మెల్యే గద్దె బాబూరావు

ప్రజాశక్తి- చీపురుపల్లి

స్థానిక ఆర్ఇసియస్ సంస్థని తిరిగి పునరుద్ధరించేందుకు కృషి చేస్తానని టిడిపి నాయకులు, మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు అన్నారు. చీపురుపల్లిలో గల ఆయన నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గద్దే మాట్లాడారు. అటు ఆర్ఇసియస్ సంస్థకు ఇటు ఎపిఇపిడిసిఎల్‌కి మధ్య నలుగుతున్న వివాదాన్ని పరిష్కరించి గతంలో మాదిరిగానే ఆర్ఇసియస్‌గా పునరుద్ధరించేందుకు స్థానిక ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావుతో కలసి ప్రభుత్వం దృష్టికి తీసుకు వెలతానన్నారు. 1982లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 9 ఆర్ఇసియస్ సంస్థలను ఏర్పాటు చేశారన్నారు. అందులో చీపురుపల్లి ఒకటని గద్దే చెప్పారు. అయితే వాటన్నిటిలోను చీపురుపల్లి సంస్థ మొదటి నుంచి లాభాలలో నడుస్తుందని ఆయన అన్నారు. సంస్థ ఏర్పడినప్పటికి కేవలం పదివేల విద్యుత్ మీటర్లు మాత్రమే ఉన్నాయన్నారు. ఆ సంఖ్య ప్రస్తుతం 70 వేలకు చేరిందన్నారు. సంస్థ ఏర్పాటైనప్పటి నుంచి ఈ ప్రాంత రైతులు చాలా లాభ పడ్డారని గద్దే అన్నారు. ఎన్నికల ముందు బాలకృష్ణ చీపురుపల్లి వచ్చేటప్పుడు కూడా ఆర్ఇసియస్ సంస్థని పునరుద్ధరిస్తామని మాటిచ్చారని గద్దే గుర్తు చేశారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు


ప్రజాశక్తి - కొత్తవలస

జిందాల్ కార్మికుల సమస్య పరిష్కరించాలని కోరుతూ కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం రెండో రోజుకు చేరాయి. జిందాల్ యాజమాన్యం లాకౌట్ పేరుతో కార్మికులను బయటకు నెట్టి నేటికి 37 రోజులు గడుస్తున్నా కనీసం స్పందించలేదని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. జిందాల్ టాప్ యాజమాన్యం దిగివచ్చి కార్మికులందరికీ భేషరతుగా పనిని కల్పించాలని కోరారు. గత 40 ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులకు యాజమాన్యం ఇటువంటి శిక్ష వేయడం విచారకరమని ఆందోళన వ్యక్తం చేశారు. ఏ కర్మాగారంలో లేని శిక్షను జిందాల్ యాజమాన్యం కార్మికులకు వేయడం విడ్డూరంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. జిందాల్ కర్మాగారంలో కార్మిక సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నామని నాయకులు అన్నారు. జిందాల్ జెఎసి నాయకులు పిల్లా అప్పలరాజు (టిఎన్‌టియుసి), గాడి అప్పారావు (సిఐటియు) నాయకత్వంలో కార్మికులు రెండవ రోజు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. దీక్షలో బర్ల అచ్చయ్యమ్మ, సింగంపల్లి నాయుడు బాబు, రాళ్లపల్లి సత్యనారాయణ, రొంగలి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'గుర్లగెడ్డ' నిర్మాణానికి సంతకాల సేకరణ

ప్రజాశక్తి- మెంటాడ

గుర్లగెడ్డ మినీ రిజర్వాయర్ నిర్మాణం చేపట్టాలని కోరుతూ శనివారం మండలంలోని ఆగూరు గ్రామంలో కౌలురైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాకోటి రాములు ఆధ్వర్యాన సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో గుర్లగెడ్డ మినీ రిజర్వాయర్ నిర్మాణం ప్రారంభించి, 25 ఏళ్లు కావస్తున్నా నేటికీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉందన్నారు. ఆయకట్టు రైతులు పలుమార్లు ఆందోళనలు చేపట్టి, మాజీ ముఖ్యమంత్రి జగన్ దృష్టికి తెసుకువెళ్లినా కార్యరూపం దాల్చలేదని తెలిపారు. పాతికేళ్లుగా సాగునీటి కోసం ఎదురు చూస్తున్న రైతులకు ప్రస్తుత ప్రభుత్వం రిజర్వాయర్ నిర్మాణానికి నిధులు కేటాయించి, పనులు పూర్తిచేయాలని కోరారు. దీనిపై రైతుల సంతకాలు సేకరించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రకాశరావు, తదితరులు పాల్గొన్నారు.



సంతకాలు సేకరిస్తున్న కౌలురైతు సంఘం నాయకులు రాములు

డిఎంహెచ్‌ఒ ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి- గంట్యాడ

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కొర్లాం గ్రామంలోని హెల్త్ వెల్నెస్ సెంటర్లను శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ భాస్కరరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా గంట్యాడ ఆరోగ్య కేంద్రం తనిఖీ చేసిన ఆయన ఆసుపత్రికి సంబంధించిన కొన్ని రికార్డులను పరిశీలన చేశారు. మందులు నెలలను తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధులు సంభవించకుండా పటిష్ట చర్యలను చేపట్టాలని ఆదేశించారు. కొన్ని విషయాలపై వైద్యాధికారులతో సమీక్షించి వారికి సూచనలను ఇచ్చారు. అనంతరం కొల్లం గ్రామంలోని హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో మాట్లాడుతూ రానున్నది వర్షాలు సీజన్ కావున ప్రతి గ్రామంలోని పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టాలన్నారు. ప్రతి ఒక్కరికీ వైద్య సేవలను అందించాలన్నారు. గర్బిణీలపై దృష్టి పెట్టాలని సమయానికి వైద్యం అందించి డెలివరీ కోసం గోశాసుపత్రికి తరలించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హేమలత డాక్టర్ వెంకటేష్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కిమిడి కుటుంబంపై సిఎంకు ఫిర్యాదు

సార్వత్రిక ఎన్నికల్లో టిడిపికి వ్యతిరేకంగా పని చేశారని ఆరోపణ

ప్రజాశక్తి- రేగిడి

సార్వత్రిక ఎన్నికల్లో రాజాం టిడిపి ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్‌కు వ్యతిరేకంగా పనిచేసిన రేగిడి మండలానికి చెందిన మాజీమంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు సోదరుడు, కుమారులపై బహిష్కరణ వేటు వేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌కు అమరావతిలో రాతపూర్వకంగా శనివారం రాజాం టిడిపి నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రాజాం పట్టణంలో ఓ కళ్యాణ మండపంలో నాలుగు మండలాల టిడిపి నాయకులు శుక్రవారం సమావేశం ఏర్పాటు చేసి ఏకగ్రీవంగా బహిష్కరణ వేటుకు తీర్మానం చేశారు. రేగిడికి చెందిన మాజీ ఎమ్మెల్యే కిమిడి గణపతి, మాజీ జడ్‌పిటిసి కిమిడి రామకృష్ణంనాయుడు, టిడిపి అధ్యక్షులు కిమిడి వినయ్ కుమార్, సర్పంచ్ రవికుమార్‌లు 2024 సార్వత్రిక ఎన్నికల్లో టిడిపికి కాకుండా వైసిపికి అనుకూలంగా పనిచేశారని విమర్శలు వచ్చాయి. దీంతో అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ నాయకులు, కార్యకర్తలు తీర్మానం చేశారు. మాజీ జెడ్‌పిటిసి కిమిడి రామకృష్ణం నాయుడు 1983 నుంచి టిడిపిలో క్రియాశీలక సీనియర్ నాయకులుగా వ్యవహరించి ఎన్నో పదవులు అలంకరించారు. రేగిడి మండలం ఎంపిపిగా, అతని సతీమణి వేణి సుందరం ఎంపిపిగా టిడిపిలో సేవలందించారు. 2014లో తన కుమారుడు మండల టిడిపి అధ్యక్షులు కిమిడి వినయ్ కుమార్ ఐదేళ్లపాటు మండలాన్ని శాసించారు. అయితే 2024 సార్వత్రిక ఎన్నికల్లో మాజీ మంత్రి కిమిడి కళా వెంకట్రావు చీపురుపల్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉన్నప్పటికీ, రాజాం నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యేగా పోటీ చేసిన కోండ్రు మురళీమోహన్‌కు వ్యతిరేకంగా పనిచేశారు. రేగిడి, ఆముదాలవలస, వెంకంపేట, రాజావలసతో పాటుగా పలు గ్రామాల్లో ఉన్న టిడిపి నాయకులతో సమావేశాలు ఏర్పాటు చేసి టిడిపికి వ్యతిరేకంగా ఓటు వేసి వైసిపికి మెజార్టీ తేవాలని నాయకులకు సూచించారు. అయినా తన శాసనం రేగిడి మండలంలో పనిచేయలేదు సరికదా, రేగిడి తప్పితే మిగతా పోలింగ్ బూతులలో వైసిపి కంటే టిడిపికే మెజార్టీ వచ్చింది. కూటమి ప్రభుత్వం రావడంతో రేగిడి మండలంలో టిడిపికి వ్యతిరేకంగా పనిచేసిన కిమిడి కుటుంబ సభ్యులతో పాటు మిగతా వారిని కూడా బహిష్కరించాలని సిఎంకు ఫిర్యాదు చేశారు. పార్టీకి నమ్మక ద్రోహం చేసిన కిమిడి కుటుంబంపై చర్యలు తీసుకోవాలని కోరారు.



కేంద్రమంత్రి రామ్మోహన్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే కోళ్ల

రెల్లిలోనే గిరిజన వర్సిటీ ఏర్పాటు చేయాలి

సిఎం, కేంద్రమంత్రికి ఎమ్మెల్యే కోళ్ల వినతి

ప్రజాశక్తి-కొత్తవలస


కొత్తవలస మండలం రెల్లి రెవెన్యూ పరిధిలోనే గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి.. సిఎం చంద్రబాబునాయుడు, కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడును కోరారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా శనివారం అసెంబ్లీ ఆవరణలో వారిని కలిసి గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుపై వినతి అందించారు. రెల్లి రెవెన్యూ పరిధిలో గిరిజన యూనివర్సిటీకి భూములు కేటాయించి, గత టిడిపి ప్రభుత్వ హయాంలోనే శంకుస్థాపన చేసి, యూనివర్సిటీకి కాంపౌండ్ వాల్ కూడా నిర్మించినట్లు తెలిపారు. అనంతరం వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గిరిజన యూనివర్సిటీని మెంటాడ మండలానికి తరలించిందని వివరించారు. గిరిజన యూనివర్సిటీని మళ్లీ రెల్లి రెవెన్యూలోనే ఏర్పాటుచేసి, ఈ ప్రాంత అభివృద్ధికి పాటుపడాలని కోరారు.

ఆశల పల్లకిలో అన్నదాత

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఓవైపు ప్రకృతి వైపరీత్యాలు, మరోవైపు చీడపీడల దాడి, ఇంకోవైపు చేతికందే పంటకు గిట్టుబాటు ధర లేకపోవడం, మార్కెటింగ్ సదుపాయమూ లేక ఏటా నష్టాలపాలవుతున్న అన్నదాత కొత్త ప్రభుత్వంలోనైనా కాస్తంత ఆర్థిక సాయం పెరుగుతుందని, సకాలంలో బ్యాంకు రుణాలు అందుతాయని ఆశగా ఎదురు చూస్తున్నాడు. ఎన్నికల ప్రచారంలో సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా రైతులకు 20వేల వరకు ఆర్థిక సాయం అందిస్తామంటూ టిడిపి అధినేత చంద్రబాబునాయుడు హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. రాష్ట్రంతోపాటు ఉమ్మడి విజయనగరం జిల్లాలో టిడిపి, జనసేనకు బంపర్ మెజార్టీతో మొత్తం 11 అసెంబ్లీ స్థానాల్లోనూ గెలిపించారు. ఇందులో ఇద్దరు మంత్రులుగా కొలువుదీరారు. ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం కూడా పూర్తయ్యింది. మరోవైపు రుతుపవనాల ఆగమనంతో జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి.

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఇప్పటికే రైతులు ఖరీఫ్ విత్తనాలు వేసేందుకు దుక్కులు దున్నారు. నారు మడులు తయారవుతున్నాయి. విత్తనాలు సమకూర్చుకోవాల్సిన సమయమిది. వీటన్నింటికీ డబ్బే ప్రధానం. ఈనేపథ్యంలో ప్రభుత్వం ఇస్తామన్న రూ.20వేల సాయం కోసం చూస్తున్నారు. మరోవైపు ఖరీఫ్ బ్యాంకు రుణాలపై అధికార యంత్రాంగంలో ఇప్పటికీ కదలిక లేదు. వరితో పాటు మిగిలిన వ్యవసాయ ఉత్పత్తులకు కేంద్రం ప్రకటించిన



మద్దతు ధర కంటితుడుపుగానే ఉంది. ఈ నేపథ్యంలో అందరికీ అన్నంపెట్టే రైతన్న ఆశ, నిరాశతో ఎదురు చూస్తున్నాడు. జిల్లా వ్యాప్తంగా ఏటా 4, 52,685 ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతున్నాయి. ఇందులో ఖరీఫ్ సీజన్ అత్యంత కీలకమైనది. ఒక్క ఈ సీజన్‌లోనే అత్యధికంగా 3,01,247 ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతున్నాయి. ఇందులో ప్రధానంగా వరి, మొక్కజొన్న, వేరుశనగ, నువ్వులు పంటలు ఉన్నాయి. ఇందులోనూ 2,34,550 ఎకరాల్లో వరి సాగు ఉంది. తద్వారా 4.82లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఈ ఏడాది ఉత్పత్తి అవుతాయని అధికారులు అంచనా రూపొందించారు. ఇటువంటి పరిస్థితుల్లో తక్షణమే ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని, లేదంటే సాగు కష్టమేనని రైతుల్లో చర్చనడుస్తోంది. వాస్తవానికి వైసిపి ప్రభుత్వం హయాంలో రైతు బరోసా పేరిట ఏటా మూడు దఫాలుగా రూ.13,500 రైతులకు అందజేశారు. కానీ, అనేక నిబంధన లు పెట్టడంతో అర్హులైన వేలాది మంది సాయానికి నోచుకోలేదు. విజయనగరం జిల్లాలో 3,63,294 మంది రైతులు ఉండగా, 2,32,704 మందికి మాత్రమే ఈ పథకం వర్తింపజేశారు. 1,421 దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించినప్పటికీ, మిగిలిన వారిలో ఎంతో మంది అర్హులు ఉన్నారు. వీరిలో ఎక్కువ మంది కౌలు రైతులు భూ యజమానుల నుంచి నిరభ్యంతర పత్రాలు తెచ్చుకోలేకపోవడంతో సాయానికి దూరం కావాల్సివచ్చింది. కొంతమందికి సాంకేతిక సమస్యలతో ఐదేళ్లు ఎదురు చూపులే మిగిలాయి. ఈ సారైనా నిబంధనలు సడలించి, తమను ఉదారంగా ఆదుకోవాలని రైతులు, వారి కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలలో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు మిగులు సీట్లకి ఈ నెల 25వ తేదీలోపు నెల్లిమర్ల గురుకుల పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీమతి కె.ఉషారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27వ తేదిన విద్యార్థులు ఏ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో చేరాలని అనుకుంటున్నారో వారు ఈ నెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అదే పాఠశాలలో ప్రవేశ పరీక్ష 27వ తేదిన జరుగుతుందని, ప్రవేశ పరీక్షకు ఆధార్ కార్డు జిరాక్స్‌తో హాజరు కావాలని కోరారు. ప్రవేశ పరీక్షలో ప్రతిభ ఆధారంగా, రిజర్వేషన్ ప్రకారం సీట్లు కేటాయిస్తారని చెప్పారు.

24న మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-బొబ్బిలి

ఈ నెల 24న ఎమ్మెల్యే బేబినాయన జన్మదినం సందర్భంగా కోటలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు రోటరీ క్లబ్ పూర్వ అధ్యక్షులు గెంబలి శ్రీనివాసరావు, అవేర్ ఫౌండేషన్ అధ్యక్షులు పి.మనోజ్ కుమార్, ఎఎంసి మాజీ చైర్మన్ పువ్వల శ్రీనివాసరావు తెలిపారు. రక్తం కొరతతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడడంతో రక్తం నిల్వలు పెంచేందుకు ఈ శిబిరం నిర్వహిస్తున్నామని చెప్పారు. రక్తదాన శిబిరంలో రక్తదాతలు, యువకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బి.సురేష్, కె.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే కళా వెంకటరావు రాక

ప్రజాశక్తి- చీపురుపల్లి

స్థానిక ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు ఆదివారం చీపురుపల్లి వస్తున్నట్లు టిడిపి శ్రేణులు తెలిపాయి. ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికలలో బొత్స సత్యనారాయణపై టిడిపి తరపున పోటీ చేసి కళావెంకటరావు విజయం సాధించారు. కాగా ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసి మొదటి సారి చీపురుపల్లి వస్తున్నారు. ఈ సందర్భంగా స్థానిక టిడిపి నాయకులు కళా వెంకటరావుకి ఘనస్వాగతం పలికేందుకు బారీ ఏర్పాట్లును చేస్తున్నారు.

ఏరువాక ప్రారంభం

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని సంకిలి గ్రామంలో శనివారం టిడిపి సీనియర్ నాయకులు, చెరుకు రైతుల రాష్ట్ర నాయకులు, రైతు నారు జనార్ధన రావు ఖరీఫ్ వ్యవసాయానికి సంబంధించి ఏరువాకను ప్రారంభించారు. ఆదర్శ రైతులు గుండ దామోదర్ రావు, నారు పట్టాభి నాయుడు, ఆకుల మన్మధరావు, బాన్న అప్పారావు తదితరులకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఖరీఫ్ వ్యవసాయానికి ముందుగానే నైరుతి రుతుపవనాలు ప్రవేశించడంతో ఎంతో సంతోషాన్నిస్తుందన్నారు. ఈ ఏడాది వర్షాలు నిండుగా ఉన్నాయని, పంటలు అధికంగా దిగుబడి వస్తాయని ఇప్పటికే అధికారులు అంచనా వేసినట్లు వెల్లడించారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన

ప్రజాశక్తి- మెంటాడ

మెంటాడ హైస్కూల్ ఆవరణలో విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై శనివారం అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆంద్ర ఎస్ఐ బి.దేవి మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. వాటివల్ల అనేక కుటుంబాలు రోడ్డున పడ్డాయని, వాటిజోలికి వెళ్లొద్దని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సిహెచ్ అరుణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆర్‌డిఒ, డిఎస్‌పిలను సత్కరిస్తున్న రోటరీ ప్రతినిధులు

ఆర్‌డిఒ, డిఎస్‌పిలకు సత్కారం

ప్రజాశక్తి-బొబ్బిలి

నియోజకవర్గంలో ఎన్నికలను విజయవంతంగా నిర్వహించిన ఆర్‌డిఒ సాయిశ్రీ, డిఎస్‌పి శ్రీనివాసరావులను రోటరీ క్లబ్ ప్రతినిధులు సత్కరించారు. శనివారం స్థానిక సూర్య రెసిడెన్సీలో వారిని సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఎన్నికల్లో ఎటువంటి అల్లర్లు, అక్రమాలు జరగకుండా నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని రోటరీ క్లబ్ ప్రతినిధులు జెసి రాజు, తూముల కార్తీక్, ఎస్.శ్రీనివాస్ అన్నారు.

60 మంది రోగులకు రక్త పరీక్షలు

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక నారాయణి హృదయాలయ ఆస్పత్రిలో 60 మంది రోగులకు శనివారం ఉచితంగా రక్త పరీక్షలు చేశారు. రక్త పరీక్షల శిబిరానికి వచ్చిన రోగులకు గుండె వైద్య నిపుణులు పెంట సునీల్ కుమార్ వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన రక్త పరీక్షలు చేశారు. గుండె సంబంధిత వ్యాధులపై అవగాహన కల్పించేందుకే రక్త పరీక్షలు చేస్తున్నామని వైద్యులు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యులు బండారు లావణ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు పంపిణీ


ప్రజాశక్తి- గరివిడి

మండలంలోని గదబవలస పంచాయతీ పరిధిలోని ఐతాంవలస ప్రాథమిక పాఠశాలలో శనివారం ఆశయ సంస్థ అధ్యక్షులు రెడ్డి రమణ ఆశయా యూత్ అసోసియేషన్ మొబైల్ బైక్ లైబ్రరీ నిర్వహించి పిల్లలకు ఉచితంగా పుస్తకాలను అందించారు. ముందుగా పిల్లలకు కథలు పుస్తకాలు చదివించి వాటి గురించి తెలియజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పుస్తకాల బాట పట్టాలనే ఉద్దేశంతో సంచార గ్రంథాలయం అందుబాటులో తీసుకువచ్చామని, పిల్లలు విజ్ఞానం కోసం కథలు నైతిక విలువలు పుస్తకాలు చదవాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవికుమార్, ఉపాధ్యాయులు రమాదేవి, పాఠశాల చైర్మన్ బి.లక్ష్మణరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలల పరిశీలన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని పాటూరు ప్రాథమిక పాఠశాలను ఎంఇఒ జి.జగదీశ్వరరావు, సింగరాయి ప్రాథమికోన్నత పాఠశాలను ఎంఇఒ-2 పి.బాలభాస్కరరావు శనివారం పరిశీలించారు. పాఠశాల ఆవరణను వారు పరిశీలించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను తనిఖీ చేశారు. క్రమం తప్పకుండా సమయానికి విద్యార్థులు హాజరయ్యేలా కృషి చేస్తున్న ఉపాధ్యాయులను ఎంఇఒలు అభినందించారు. అధిక సంఖ్యలో ప్రవేశాలు జరుగుతున్నాయని, క్రమశిక్షణతో విద్య అందుతుందన్న నమ్మకం తల్లిదండ్రుల్లో కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు.



విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఎంఇఒ

కళాశాల సాధన సమితి చొరవ

ఇంటర్ చదువుకు చేయూత ● జామిలో ఇంటర్ తరగతులు ప్రారంభం



తరగతులకు హాజరైన విద్యార్థులు

ప్రజాశక్తి - జామి

మనసు ఉంటే... మార్గం ఉంటుందని పెద్దలు అంటారు. నిజమే జూనియర్ కళాశాల ఏర్పాటుకు ఎన్నో పోరాటాలు చేసి, చివరికి కమిటీనే ఏర్పాటైంది. అదే కమిటీ నేడు జామిలో ఇంటర్ చదువును పేద విద్యార్థులకు అందజేయాలని బావిస్తోంది. ప్రభుత్వ జూనియర్ కళాశాల సాధనకు ఏర్పడిన సాధన సమితి ఇప్పుడు ఇంటర్ ప్రవేశాలు, పాఠ్యాంశాల బోధనకు అవసరమైన అధ్యాపకుల ఏర్పాటుకు కృషి చేస్తోంది. ఈ నేపథ్యంలోనే ప్రతి పేద విద్యార్థి ఇంటర్ చదువును ఉచితంగా పొందే అవకాశాన్ని సద్వినియోగం చేయనుకోవాలని ఉపాధ్యాయులు, సాధన సమితి సభ్యులు కోరుతున్నారు.

జామి మండల కేంద్రంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో హైస్కూల్‌లో ఇంటర్ తరగతులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం ఎంపిసి, సిఇసి గ్రూపులు ప్రారంభించారు. విద్యార్థులు కూడా తరగతులకు హాజరవుతున్నారు. విద్యారంగంలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు బోధన అందిస్తున్నారు. అదనంగా జూనియర్ కళాశాల సాధన సమితి ఆధ్వర్యంలో లెక్చరర్లను కూడా నియమిస్తున్నారు. విద్యార్థులు చెల్లించాల్సిన ఫీజులు ఒక్కొక్కరికి సుమారు రూ.3 వేలు కూడా స్థానికంగా జూనియర్ కళాశాల సాధన సమితి సభ్యులే చెల్లిస్తున్నారు. పాఠ్య పుస్తకాలను గతంలో ప్రభుత్వం ఇవ్వలేదు. ప్రస్తుత ప్రభుత్వం యూనిఫాం, పాఠ్యపుస్తకాలు కూడా ఇస్తామని ప్రకటించింది. సకాలంలో ప్రభుత్వం ఇవ్వకపోతే విద్యార్థులందరికీ సాధన సమితి అందిస్తుందని సభ్యులు చెబుతున్నారు. ఈ సంవత్సరం పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులంతా జామి ఉన్నత పాఠశాలలో ఇంటర్‌లో చేరేలా అవకాశం ఉన్న ప్రతిఒక్కరూ, ప్రజలు సహకారం అందించాలని అటు సాధన సమితి సభ్యులు, ఇటు ప్రభుత్వ అధికారులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవాలి : డిపిఎం

ప్రజాశక్తి-విజయనగరం కోట

విపత్తుల వలన సంభవించే అత్యవసర పరిస్థితులను ఎదుర్కోడానికి ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలని విపత్తుల శాఖ డిపిఎం రాజేశ్వరి తెలిపారు. విపత్తులు సంభవించినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలపై ప్రజలందరికీ అవగాహన కలిగించాలని తెలిపారు. శనివారం యూత్ హాస్టల్ నందు విపత్తుల బృందంతో యూత్ వాలంటీర్లకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిపిఎం రాజేశ్వరి మాట్లాడుతూ జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి అవగాహనా సదస్సులు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలో అవగాహనా కల్పించడానికి పలు గ్రూప్ లను ఎంపిక చేస్తామని తెలిపారు. వరదలు, తుఫాన్లు, అగ్నిప్రమాదములు, భూకంపాలు, గుండెపోటు సంభవించేటప్పుడు, పిడిగులు పడే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామాల్లో అవగాహనా కలిగిస్తారని తెలిపారు. ప్రజలంతా ఈ అవగాహనా సదస్సుల్లో పాల్గొనేలా రెవిన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని, ఇందులో శిక్షణ పొందిన వాలంటీర్లు కూడా పాల్గొనాలని తెలిపారు. సమావేశంలో తహశీల్దార్ రత్నం, ఎన్‌డిఆర్‌ఎఫ్ ప్రతినిధులు, యూత్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



ప్రయోగాత్మకంగా అవగాహన కల్పిస్తున్న ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది

సిబిఎం ఆస్తుల అమ్మకానికి కుట్ర

ప్రజాశక్తి-బొబ్బిలి

పేద విద్యార్థులకు విద్యనందిస్తున్న సిబిఎం పాఠశాల ఆస్తులను అమ్మివేసేందుకు కుట్ర పన్నుతున్నారని కెనెడియన్ బాప్టిస్ట్ చర్చి సభ్యులు డేవిడ్ ఆరోపించారు. పట్టణంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సిబిఎం పాఠశాలను కోమటిపల్లి లేదా కలవరాయి ప్రాంతాలకు తరలించాలని చూస్తున్నారని తెలిపారు. పట్టణ నడిబొడ్డున ఉన్న సిబిఎం పాఠశాల స్థలాన్ని అమ్మివేసేందుకు కరస్పాండెంట్ అని చెప్పుకుంటున్న రత్నకుమార్ అనే వ్యక్తి ప్రయత్నిస్తున్నారని చెప్పారు. సిబిఎం పాఠశాల ఆస్తులను కాపాడాలని జిల్లా కలెక్టర్, రెవెన్యూ, విద్యా శాఖాధికారులను కోరారు.

వరి విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బానాది, బల్లంకి, వేపాడ, గ్రామాల్లో శనివారం రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. బానాదిలో ఎంపిటిసి గొంప తులసి, వేపాడలో తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షులు గుమ్మడి భారతి, సర్పంచ్ ఎం.అర్జునమ్మ, ఎంపిటిసి గంగతల్లి, బల్లంకిలో సర్పంచ్ బి.లక్ష్మి, ఎఒ యశ్వంత్‌కుమార్ విత్తనాలు అందజేశారు. ఆయా రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ శాఖ గ్రామ సహాయకుల ఆధ్వర్యాన ఈ కార్యక్రమం చేపట్టారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

విజయనగరం కోట : మాదక ద్రవ్యాల వలన కలిగే దుష్ప్రభావాలను ప్రజలకు, యువతకు వివరించి వారిని మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా చేసేందుకు వన్ టౌన్ పోలీసులు చర్యలు చేపట్టారు. ఎస్‌పి ఎం.దీపిక ఆదేశాలతో వన్ టౌన్ సిఐ బి.వెంకటరావు ఆధ్వర్యంలో వన్ టౌన్ ఎస్ఐలు నరేష్, నవీన్ పడాల్ శనివారం స్థానిక మహారాజా, ఆదిత్య డిగ్రీ కళాశాలను సందర్శించి, విద్యార్థులతో మమేకమయ్యారు. విద్యార్థులకు మత్తు కలిగించే గంజాయి, డ్రగ్స్, హెరాన్, గుట్కా, ఖైనీలను వినియోగించి, జీవితాలను నాశనం చేసుకోవద్దని కోరారు.

సిపిఐ నాయకుడు తాలాడ మృతి

నెల్లిమర్ల : జరజాపు పేటకు చెందిన సిపిఐ సీనియర్ నాయకులు తాలాడ సన్ని బాబు (74) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందారు. మూడు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ విజయనగరంలోని ఒక ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్సపొందారు. సన్నిబాబుకి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. సన్నిబాబు మృతికి మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పల నాయుడు, సిపిఐ నాయకులు పి.కామేశ్వరరావు, బుగత అశోక్, ఒమ్మి రమణ, ఆనందరావు, ఎఐటియుసి నాయకులు రంగరాజు, సిపిఎం నాయకులు కిల్లంపల్లి రామారావు, కనకల రాము, సిపిఐ మండల నాయకులు మొయిద పాపారావు, ఐఎఫ్‌టియు నాయకులు కాళ్ళ సన్యాసిరావు, బోని సత్యనారాయణ, వైసిపి నాయకులు సముద్రపు రామారావు నివాళులర్పించారు.

సచివాలయాలపై టిడిపి పెత్తనం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని వార్డు సచివాలయాలపై అధికార టిడిపి నాయకుల పెత్తనం ప్రారంభమైందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. అధికార పార్టీ నాయకులు అనే 'హోదా' తప్ప ప్రజాప్రతినిధులుగా ఎటువంటి అధికారాలూ నాయకులకు లేవు. ఎమ్మెల్యేలు తప్ప ఇంకా ఎటువంటి పదవులు ఎక్కువ మందికి లేవు. ఆమె కార్పొరేటర్ కాదు.. ఒక డివిజన్‌లో టిడిపి నాయకురాలు. అటువంటి మహిళ శనివారం కంటోన్మెంట్ సచివాలయానికి వెళ్ళడం, సచివాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలకడం, సిబ్బంది కుర్చీలో కూర్చొని వారితో మాట్లాడటం చర్చనీయాంశంగా మారింది. దీంతోపాటు సచివాలయ సిబ్బందితో గ్రూపు ఫొటో దిగడం, వాటిని సోషల్ మీడియాలో పెట్టడం నగరంలో చర్చకు దారితీసింది. కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు కాకపోయినా టిడిపి నాయకులు పెత్తనం ప్రారంభమైందనే చర్చ సాగుతోంది.

కొత్తవలసలో జనసేన సందడి

ప్రజాశక్తి - కొత్తవలస

జనసేన అధినేత పవన్ కల్యాణ్ అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా కొత్తవలసలో శుక్రవారం జనసేన కార్యకర్తలు సందడి చేశారు. స్థానిక చైతన్య బధిరుల పాఠశాలలో కేకు కోసి విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ గుండెల నిండా నిజాయితీగల పవన్ కల్యాణ్ లాంటి వ్యక్తి చట్ట సభల్లో అడుగుపెడితే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. ఆయన హయాంలో పంచాయతీలు బలబడి, గ్రామ స్వరాజ్యం దిశగా అడుగులు వేస్తాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పిల్లా రామదుర్గ, టౌన్ అధ్యక్షుడు గాలి అప్పారావు, ఉపాధ్యక్షుడు కరాటే లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి రాందాస్ కాశి, జిల్లా ప్రచార కార్యదర్శి మల్లువలస శ్రీను, సీనియర్ నాయకులు జిన్నాల శ్రీను, మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

కొండపల్లిని కలిసిన పిల్లా, అవనాపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర సూక్ష్మ,మధ్య,చిన్న తరహాపరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను అమరావతిలో టిడిపి పార్టీ సీనియర్ నాయకులు పిల్లా విజయ్ కుమార్, అవనాపు విజయ్ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గాడు అప్పారావు,రౌతు చంటి,ఈగల అజయ్,దత్తి సోము నాయుడు, కాళ్ళ రఘు, బేత రవి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్యశిబిరానికి విశేషస్పందన

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని రెల్లివలసలో సర్పంచ్ ఇజ్జురోతు అప్పలరాజు, ఈశ్వర్రావు ఆధ్వర్యంలో అనిల్ నిరుకొండ హాస్పిటల్ వారిచే శనివారం నిర్వహించిన ఉచిత దంత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. దంత సమస్యలతో వచ్చిన ప్రజలకు ఉచితంగా తనిఖీలు చేసి సమస్యలను పరిష్కరించారు. సర్పంచ్ భర్త ఈశ్వరరావు మాట్లాడుతూ ఈ శిభిరంలో 150 మందికి పరీక్షలు నిర్వహించామన్నారు. దంత సమస్యలు ఎక్కువగా ఉన్నవారికి సోమవారం బస్ ఏర్పాటు చేసి వారికి ఉచిత చికిత్స కోసం హాస్పిటల్‌కి తీసుకువెళ్ళి వైద్యం అందిస్తామన్నారు. ఇటువంటి శిబిరాలు వల్ల ప్రజలకు ఉపయోగం అన్నారు. చాలా మంది దూరప్రాంతాల్లో ఉన్న దంత వైద్యుల దగ్గరకు వెల్లి చికిత్స చేయించుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. శిబిరంలో డాక్టర్ కె. శ్రీనివాసరావు, డాక్టర్ హదాస్సా, పిఆర్ఒ ఎన్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి త్రినాదరావు తదితరులు పాల్గొన్నారు.



శిబిరంలో సేవలందిస్తున్న వైద్యులు

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.ఎం.నాయుడు అన్నారు. శనివారం నగరంలోని వివిధ ప్రాంతాలలో పరిసరాల పరిశుభ్రతపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డక్కిన వీధి, బింగివీధి తదితర ప్రాంతాల్లో పర్యటించి అపరిశుభ్ర వాతావరణంలో ఉన్న ప్రాంతాలను చూసి సిబ్బంది పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడే ఉన్న అల్పాహార దుకాణం వద్ద సదరు వ్యాపారస్తులు ప్లాస్టిక్ కవర్లతో, చెత్తాచెదారాలతో పరిసరాలను అపరిశుభ్రంగా తయారు చేయడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. వ్యాపారులను పిలిచి అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ సంచులు, క్యారీ బ్యాగులు వంటివి వినియోగిస్తే అపరాధ రుసుం వసూలు చేస్తామని హెచ్చరించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు సమిష్టి కృషి అవసరమని అన్నారు.



పారిశుధ్యాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ ఎంఎం నాయుడు



కళావేదికను ప్రారంభిస్తున్న ఎస్‌పి దీపిక

పోలీసు స్కూల్లో కళావేదిక ఏర్పాటు

ప్రజాశక్తి-విజయనగరం కోట

కంటోన్మెంట్ లోని పోలీసు సంక్షేమ పాఠశాలలో శారద మెటల్స్, అల్లాయిస్ కంపెనీ సౌజన్యంతో నూతనంగా నిర్మించిన 'శారద కళా వేదిక'ను ఎస్‌పి ఎం.దీపిక శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీసు సంక్షేమ ఆంగ్ల పాఠశాల క్రమంగా వృద్ధి చెందుతుందని, ఇప్పటికే అనేక సౌకర్యాలతో కార్పొరేట్ స్కూల్స్‌కు దీటుగా, ఉన్నత విద్యను, క్రమశిక్షణను తక్కువ ఫీజులతో అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కొత్తవలసకు చెందిన శారద మెటల్స్ అండ్ అల్లాయిస్ కంపెనీ స్వచ్ఛందంగా పోలీసు సంక్షేమ పాఠశాలలో కళా వేదికను నిర్మించేందుకు ముందుకు వచ్చి, నిర్మాణం పూర్తి చేయడం అభినందనీయమన్నారు. శారద మెటల్స్ అండ్ అల్లాయిస్ కంపెనీ సీనియర్ జి.ఎం.ప్రభాత్ మోహన్ మాట్లాడుతూ - తమ కంపెనీ తరుపున సేవా కార్యక్రమాలు చేపట్టే క్రమంలో ఎక్కువగా విద్యార్థుల భవిష్యత్తునే దృష్టిలో పెట్టుకుంటా మన్నారు. ఇందులో భాగంగా ఈసారి పోలీసు సంక్షేమ పాఠశాలను ఎంపిక చేసుకొని, కళా వేదిక నిర్మాణ చేపట్టామన్నారు. అనంతరం, కంపెనీ యాజమాన్యంపాఠశాల విద్యార్థులకు పెన్సిల్స్, కేకులను ఎస్‌పి దీపిక చేతుల మీదుగా పంపిణీ చేసారు. కార్యక్రమంలో ఎఆర్ అదనపు ఎస్‌పి ఎంఎం సోల్మన్, ఎఆర్ డిఎస్‌పి యూనివర్స్, శారద మెటల్స్ అండ్ అల్లాయిస్ కంపెనీకి చెందిన సీనియర్ జిఎం (హెచ్ఆర్) ప్రభాత్ మోహన్, సీనియర్ జిఎం (సివిల్) విజయ భాస్కర్, డిజిఎం (హెచ్ఆర్) హెచ్.సన్యాసి రావు, ఎస్‌బి సిఐ కెకె వి.విజయనాథ్, ఆర్ఐలు ఎన్.గోపాల నాయుడు, ఆర్.రమేష్ కుమార్, భగవాన్, వెల్ఫేర్ ఆర్ఎస్ఐ వరప్రసాద్, ఎస్ఐ అశోక్ కుమార్ పాఠశాల ప్రిన్సిపాల్ పి.సంధ్య పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి : సిఐటియు

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రైవేట్ విద్యా సంస్థలలో పని చేస్తున్న టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రైవేట్ విద్యా సంస్థలలోని పని చేస్తున్న ఉద్యోగులకు భద్రత లేకపోవడంతో నచ్చినప్పుడు యాజమాన్యాలు తొలగిస్తున్నాయని అన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి విద్యా సంస్థలను నమ్ముకుని పని చేసి కుటుంబాలను పోషిస్తున్న వారిని అర్ధాంతరంగా తొలగిస్తే వారి కుటుంబాలు రోడ్డును పడతాయని అన్నారు. ఉద్యోగులకు పిఎఫ్, ఇఎస్ఐ, గ్రాడ్యుటి సౌకర్యం కల్పించాలని, ప్రైవేట్ విద్యా సంస్థలలో కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆయనతో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు యుగంధర్ ఉన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి-విజయనగరం కోట

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లాలో విటి అగ్రహారం పాఠశాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఐసిడిఎస్ తరపున నోడల్ ఆఫీసర్ విజయ కుమారి, సిడిపిఒ ప్రసన్న, హెచ్ఎం అభినందించారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

సురేష్ స్కూల్ పుస్తకాలు సీజ్

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలను ప్రింట్ చేసి విద్యార్థులకు అధిక ధరలకు అమ్ముతున్న సురేష్ స్కూల్ పుస్తకాలను విద్యా శాఖాధికారులు సీజ్ చేశారు. పట్టణంలో సురేష్ స్కూల్ యాజమాన్యం పుస్తకాలను స్కూల్ పేరుతో ప్రింట్ చేసి అధిక ధరలకు అమ్మి విద్యార్థులను, తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నారు. పుస్తకాలు అధిక ధరలకు అమ్మడంతో విద్యార్థి జెఎసి అధ్యక్షులు సాయికిరణ్ తెలుసుకుని పుస్తకాలను పరిశీలించి డిప్యూటీ డిఇఒకు ఫిర్యాదు చేయగా ఆయన ఆదేశాలు మేరకు అధికారులు పుస్తకాలను సీజ్ చేశారు. అధిక ధరలకు పుస్తకాలు అమ్ముతున్న విద్యా సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సాయికిరణ్ డిమాండ్ చేశారు.

అనారోగ్యంతో టిడిపి నాయకుడు మృతి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు గోకాడ సత్యనారాయణ (47) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. మండల టిడిపిలో ఆయన క్రియాశీలకంగా వ్యవహరించడంతో పాటు గ్రామంలో పాలకేంద్రం కార్యదర్శిగా పనిచేశారు. ఆయన మృతికి ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శులు కెబిఎ రాంప్రసాద్, ఇందుకూరి సుధారాజు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్, మండల పార్టీ అధ్యక్ష కార్యదర్శులు జిఎస్ నాయుడు, జుత్తాడ రామసత్యం తదితరులు సంతాపం తెలిపారు.

నేరాలు ఘోరాలు

భర్తే హంతకుడు

అనుమానంతో భార్యకు ఉరివేసి పరారీ

ప్రజాశక్తి-గజపతినగరం

మండలంలోని బంగారమ్మపేట గ్రామానికి చెందిన వివాహిత తాడితూరి అనూష (20)మృతి కేసును పోలీసులు ఛేదించారు. సిఆర్‌పిఎఫ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఆమె భర్తే ఆమెకు ఉరివేసి చంపేసి పరారైనట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈమేరకు శనివారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను డిఎస్‌పి శ్రీనివాసరావు, సిఐ ఎన్‌వి ప్రభాకరరావు వివరించారు. బంగారమ్మ పేట గ్రామానికి చెందిన మక్కా జగదీష్‌తో నాలుగు నెలల క్రితం అనూషకు వివాహం జరిగింది. అదే గ్రామానికి చెందిన బోని వెంకట దుర్గాప్రసాద్‌తో గత కొన్నేళ్లుగా ఆమెకు స్నేహం ఉండేది. ఈనేపథ్యంలో అనుమానం పెంచుకున్న అనూష భర్త ఆమెను చంపేందుకు ప్రణాళిక వేశాడు. ఈనెల 17న చేతులు గ్లౌజ్‌లు వేసుకొని నైలాన్ తాడుతో ఆమెకు ఉరివేసి చంపేశాడు.అనంతరం ఆమె సెల్‌నుంచి సోదరుడికి, తల్లిదండ్రులకు తన భర్త మంచోడని, బాగా చూసుకోవాలంటూ మెసేజీలు పంపాడు. మెసేజ్‌లన్నీ ఒకే సమయంలో వెళ్లడందతో అనుమానించి పోలీసులు జగదీష్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా,నేరాన్ని అంగీకరించాడు. అతడ్ని పోలీసులు అరెస్టు చేశారు.

విద్యుదాఘాతంతో కేబుల్ ఆపరేటర్ మృతి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

విద్యుత్ షాక్‌తో శనివారం కేబుల్ ఆపరేటర్ మృతి చెందారు. స్థానికులు అందించిన వివరాల ప్రకారం.. తమ్మాపురం పంచాయతీ పరిధి ఆల్తిపాలెంలో ఎపి ఫైబర్ కేబుల్ ఆపరేటర్ వడ్డాది ఉమా మహేశ్వరరావు (39) శుక్రవారం కురిసిన వర్షాలకు ఆల్తిపాలెంలో కేబుల్ వైర్ తెగిపోవడంతో మరమ్మత్తులు చేయడానికి విద్యుత్తు స్తంభం ఎక్కి కేబుల్ వైర్ లాగుతుండగా, పైనుంచి వెళ్తున్న విద్యుత్ వైర్ తగిలి షాక్‌కు గురై మృతి చెందారు. కాగా మృతుడికి భార్య పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఉమామహేశ్వరరావు(ఫైల్)

ఉరివేసుకొని పెయింటర్ ఆత్మహత్య

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన పి.అజయ్‌కుమార్ (35) శనివారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పెయింటర్‌గా పనిచేస్తున్న అజయ్‌కుమార్ మద్యానికి బానిసై పలువురి వద్ద అప్పులు చేశాడు. తాగొద్దని పలుమార్లు భార్య చెప్పినప్పటికీ ఫలితం లేకపోయింది. ఈనేపథ్యంలో శనివారం ఉదయం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరిచేసు వేసుకొని మృతి చెందాడు. ఆయనకు నాలుగేళ్ల కుమార్తె, భార్య ఉన్నారు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.